Follow:
pallavinews.com

అక్షర
# పల్లవి

28.12.2025 ఆదివారం, హైదరాబాద్ www.pallavinews.com



## అకున్ సబర్వాల్ రిపోర్ట్ ఏమైంది?

- డ్రగ్స్ కేసులో బడా బాబులను రక్షిస్తున్నారా?
- నాటి సీఎస్ సోమేశ్ కుమార్‌ను వెంటనే విచారించాలి
- ఈగల్ టీమ్‌లో కొందరు అమ్ముడుపోయారు
- డ్రగ్స్ కేసులో కేంద్ర మంత్రి బండి సంజయ్ షాకింగ్ కామెంట్స్

3



## చార్జిషీట్‌లోకెక్కిన పుష్పరాజ్!

సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో బిగ్ ట్విస్ట్

తొక్కిసలాట కేసులో ఏ-11గా ఐకాన్ స్టార్ హీరో అల్లు అర్జున్

పుష్ప-2 ప్రీమియర్ షో విషాదంపై ఏడాది తర్వాత కీలక మలుపు

3



## సొంత జిల్లాపై రేవంత్‌ది కపట ప్రేమ

రెండేళ్లలో తట్టెడు మట్టి కూడా తీయలేదు

హరీష్ రావు నిర్వాకం వల్లే కల్వకుర్తి మోటార్లు ఆగమయ్యాయి

పొంగులేటికి, మెగా కృష్ణారెడ్డికి వేల కోట్ల అడ్వాన్సులు

3




# తెలంగాణ సంపద ఢిల్లీకి కప్పం!

## పంచాయతీల నిధులు ఆపితే ఊరుకోం: కేటీఆర్

## ప్రజలు తిరగబడితే కాంగ్రెస్ గద్దె దిగక తప్పదు

- సర్పంచులను బెదిరిస్తే ఖబడ్దార్.. రేవంత్ రెడ్డి
- పంచాయతీలకు నిధులు ఆపడం ఎవరి తరం కాదు
- బీఆర్ఎస్ సర్పంచులకు వెన్నెముకలా ఉంటాం
- తెలంగాణ ఆత్మగౌరవ నేతల విగ్రహాలను తాకే హక్కు లేదు
- సింహం బయటకు రాకముందే నక్కలన్నీ మొరుగుతున్నాయి
- నేను ఆంధ్రలో చదివితే తప్పా? మరి నీ అల్లుడు ఎక్కడి వాడు?
- హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ.. నీకు ఏ భాషలో తిట్టాలో చెప్ప
- బీఆర్ఎస్ సర్పంచుల సన్మాన కార్యక్రమంలో కేటీఆర్ హాట్ కామెంట్స్



పల్లవి, మహబూబాబాద్:

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు కాకముందే ప్రజల్లో ఆ పార్టీ పట్ల తీవ్ర వ్యతిరేకత, తిరుగుబాటు మొదలైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. మహబూబాబాద్‌లో జరిగిన బీఆర్ఎస్ సర్పంచుల సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, ఎన్నికల్లో గెలిచిన వారితో పాటు, అధికార పార్టీ ఆగడాలను ఎదిరించి తక్కువ ఓట్ల తేడాతో ఓడిన అభ్యర్థులను, కార్యకర్తలను అభినందించారు. సాధారణంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీకి అనుకూల ఫలితాలు వస్తాయని, కానీ తెలంగాణలో నేడు పరిస్థితి భిన్నంగా ఉందని, కాంగ్రెస్‌కు ధీటుగా బీఆర్ఎస్ విజయాలు సాధించడమే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. సర్పంచ్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని అడ్డం పెట్టుకుని అనేక అక్రమాలకు పాల్పడిందని కేటీఆర్ ఆరోపించారు. "స్వల్ప తేడాతో బీఆర్ఎస్ గెలిచిన చోట్ల రీకౌంటింగ్ పేరుతో ఫలితాలను తారుమారు చేశారు. కొన్ని చోట్ల తొలుత బీఆర్ఎస్ గెలిచినట్లు ప్రకటించి, ఆ తర్వాత కాంగ్రెస్‌ను విజేతగా మార్చారు. ఒక్క మహబూబాబాద్‌లోనే కాదు, రాష్ట్రమంతా ఇలాంటి జిమ్మిక్కులు జరిగాయి. కానీ ప్రజల్లో మార్పు మొదలైంది, అందుకే బీఆర్ఎస్‌కు మంచి ఫలితాలు వచ్చాయి" అని ఆయన అన్నారు.

రేవంత్ రెడ్డి హామీలు విఫలమైన గ్యారంటీలు..

ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను కేటీఆర్ ఎండగట్టారు. "లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తానన్నాడు, రూ.4 వేల పింఛన్ ఇస్తానన్నాడు, ఇంట్లో ఇద్దరు ముసలివాళ్లుంటే ఇద్దరికీ ఇస్తానన్నాడు. సోనియా, రాహుల్ గాంధీ మీద ఒట్లు పెట్టి ప్రజలను నమ్మించాడు. మరి రెండేళ్లలో ఏం చేశావు రేవంత్ రెడ్డి?" అని ప్రశ్నించారు.

• మిగతా 2లో..

# ప్రతి పైసా ప్రజలకే..

## అప్పుల భారమున్నా ఆగని సంక్షేమ పథకాలు

గత ప్రభుత్వం 8 లక్షల కోట్ల అప్పులు మిగిల్చినా ఆగని అభివృద్ధి

ఏప్రిల్ నుంచి రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ

రైతులకు రూ. 12,500 కోట్లతో నాణ్యమైన ఉచిత విద్యుత్ సరఫరా.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

పేదవాడి ముఖంలో చిరునవ్వు చూడటమే మా ధ్యేయం: మంత్రి పొంగులేటి

మంత్రుల చేతుల మీదుగా సబ్ స్టేషన్ల ప్రారంభం



పల్లవి, ఖమ్మం:

ప్రజా ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి పైసా రాష్ట్రంలోని ప్రజల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకే ఖర్చు చేస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు స్పష్టం చేశారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఎన్.పీ.డి.సి.ఎల్ సీఎండి వరుణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిలతో కలిసి నేలకొండపల్లి మండలంలో పర్యటించి సబ్ స్టేషన్ల ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, లో వోల్టేజ్ సమస్యలు రాకుండా, వ్యవసాయ అవసరాలు, ప్రజల గృహ అవసరాలకు ఇబ్బందులు రాకుండా ఉండాలని స్థానిక ప్రజా ప్రతినిధి మంత్రి వర్యులు సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని తమ దృష్టికి తీసుకొని వస్తే వెంటనే మంజూరు చేసి అతి తక్కువ సమయంలోనే నిర్మాణం పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. గత పాలకులు రాష్ట్ర ప్రజలపై 8 లక్షల కోట్ల భారీ అప్పుల భారం మోపినప్పటికీ ప్రజలకు ఉపయోగపడే విధంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలను అమలు చేయలేదని

• మిగతా 2లో..



## ఖైరతాబాద్‌కు ఉప ఎన్నిక ఖాయమేనా?

- పదవి పోయినా పర్లేదు.. మళ్లీ గెలిచేది నేనే
- ఎమ్మెల్యే దానం నాగేందర్ సంచలన హింట్
- ఉప ఎన్నిక వచ్చినా తగ్గేదేలేదని స్పష్టం
- ఆరుసార్లు గెలిచా.. ఏడోసారి గెలవడం నాకు కొత్త కాదు
- స్పీకర్ తీర్పు వెలువడక ముందే దానం దూకుడు
- ఖైరతాబాద్ ఎమ్మెల్యేపై స్పీకర్ వేటు ఖాయమేనా?
- దానం నాగేందర్ వ్యాఖ్యలతో మారిన పొలిటికల్ సీన్

2

## వర్కింగ్ జర్నలిస్టులను విభజించొద్దు

- డెస్క్ జర్నలిస్టులకు అక్రెడిటేషన్లు ఇవ్వాలి
- డెస్క్ జర్నలిస్టు ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ డిమాండ్
- హైదరాబాద్ కలెక్టరేట్ ఎదుట భారీ ఎత్తున నిరసన, వినపత్రం అందజేత



2

GENERAL
ఆదివారం
28.12.2025
హైదరాబాద్
అక్షర పల్లవి
www.pallavinews.com
2
follow: pallavinews

# ఖైరతాబాద్‌కు ఉప ఎన్నిక ఖాయమేనా?

## పదవి పోయినా పర్లేదు.. మళ్లీ గెలిచేది నేనే

**ఎమ్మెల్యే దానం నాగేందర్ సంచలన హింట్**

**ఉప ఎన్నిక వచ్చినా తగ్గేదేలేదని స్పష్టం**

**ఆరుసార్లు గెలిచా.. ఏడోసారి గెలవడం నాకు కొత్త కాదు**

**స్పీకర్ తీర్పు వెలువడక ముందే దానం దూకుడు**

**ఖైరతాబాద్ ఎమ్మెల్యేపై స్పీకర్ వేటు ఖాయమేనా?**

**దానం నాగేందర్ వ్యాఖ్యలతో మారిన పొలిటికల్ సీన్**



### గ్రేటర్ కాంగ్రెస్ బాధ్యత నాదే..

**ఉప ఎన్నికల సంగతి పక్కన పెడితే, రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలే తన తదుపరి లక్ష్యమని దానం ప్రకటించారు. గ్రేటర్ హైదరాబాద్‌లోని 300 డివిజన్లలో (విస్తరించిన పరిధితో కలిపి) పర్యటించి కాంగ్రెస్ జెండా ఎగురవేస్తానని సవాల్ విసిరారు. నగరం ఓఆర్ఆర్ వరకు విస్తరించడం వల్ల హైదరాబాద్‌కు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వస్తుందని, కాంగ్రెస్ హయాంలోనే నగరం మరింత అభివృద్ధి చెందుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇప్పటికే ఐదుగురు ఎమ్మెల్యేల విషయంలో స్పష్టత ఇవ్వగా, దానం సహా మిగిలిన వారిపై ఎప్పుడైనా నిర్ణయం వచ్చే అవకాశం ఉంది.**

పల్లవి, హైదరాబాద్:

తెలంగాణ రాజకీయాల్లో అత్యంత ఆసక్తికరంగా మారిన పార్టీ ఫిరాయింపుల వ్యవహారం ఇప్పుడు నిర్ణయాత్మక దశకు చేరుకుంది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలన్న పిటిషన్లు స్పీకర్ వద్ద తుది విచారణలో ఉన్నాయి. ఈ క్రమంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ చేసిన వ్యాఖ్యలు "ఖైరతాబాద్‌కు ఉప ఎన్నిక ఖాయమేనా?" అనే చర్చకు దారితీశాయి. తనపై అనర్హత వేటు పడినా, పదవి పోయినా తాను దేనికైనా సిద్ధమేనని, మరోసారి ఎన్నికలు వస్తే మరింత భారీ మెజారిటీతో గెలిచి తీరుతానని దానం ధీమా వ్యక్తం చేశారు. "నేను ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీ గెలుస్తుంది.. అది నా చరిత్ర" అంటూ ఆయన తన ఆత్మవిశ్వాసాన్ని చాటుకున్నారు.

**నేను కాంగ్రెస్ వాదినే!..**

బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచిన దానం నాగేందర్, ఆ తర్వాత కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుని సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానానికి పోటీ చేసిన సంగతి తెలిసిందే. టెక్నికల్‌గా ఇది పార్టీ ఫిరాయింపు కిందకే వస్తుందని, అందుకే ఆయనపై వేటు పడటం ఖాయమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే దీనిపై దానం స్పందిస్తూ.. "ఇతర ఎమ్మెల్యేల సంగతి నాకు అనవసరం, నేను మాత్రం స్పష్టంగా కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నాను. భవిష్యత్తులోనూ ఇదే పార్టీలో కొనసాగుతాను" అని స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యల ద్వారా ఆయన స్పీకర్ ఇచ్చే తీర్పును ఎదుర్కోవడానికి, అవసరమైతే ప్రజా క్షేత్రంలోకి వెళ్లడానికి మానసికంగా సిద్ధమయ్యారనే సంకేతాలు ఇచ్చారు.

**కేటీఆర్ తీరుపై విరుచుకుపాటు..**

ఇదే సమయంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వైఖరిని దానం తప్పుబట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కేటీఆర్ ఏకవచనంతో సంబోధించడం పట్ల ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. "సీఎం పదవికి ఒక గౌరవం ఉంటుంది. విమర్శలు చేసే హక్కు ఎవరికైనా ఉంటుంది కానీ, వ్యక్తిగత దూషణలు చేయడం, హోదాను విస్మరించడం సరికాదు" అని హితవు పలికారు. కేటీఆర్ విమర్శలు చేస్తే తాము ప్రతి విమర్శలు ఎదుర్కోవడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని కౌంటర్ ఇచ్చారు.

# తెలంగాణ సంపద ఢిల్లీకి కప్పం!

(మొదటిపేజీ తరువాయి)

అత్తెసరు మార్కులతో గద్దెనెక్కిన కాంగ్రెస్, గ్యారంటీ కార్డుల పేరుతో ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించిందని మండిపడ్డారు. మహిళలకు ఫ్రీ బస్సు అని చెప్పి, మగవారికి డబుల్ టికెట్, విద్యార్థుల బస్ పాస్ ధరలు పెంచారని విమర్శించారు. ధనిక రాష్ట్రమైన తెలంగాణను ఆగమాగం చేసి, ఇక్కడి సంపదను ఢిల్లీకి మూటలు కడుతున్నారని ఆరోపించారు.

**నూకల రామచంద్రారెడ్డి విగ్రహావిష్కరణపై విమర్శలు..**

మాజీ నేత నూకల రామచంద్రారెడ్డి విగ్రహావిష్కరణపై కేటీఆర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ఆయన కాంగ్రెస్‌లో ఉన్నా ఢిల్లీ పెద్దలకు గులాంగిరీ చేయని గొప్ప నాయకుడు. కాంగ్రెస్ ఆయన్ని మర్చిపోయినా, కేసీఆర్ గారు కలెక్టరేట్ ముందు ఆయన విగ్రహం పెట్టాలని నిర్ణయించారు. కేసీఆర్ నిర్ణయం తర్వాతే కాంగ్రెస్ నేతలకు సోయి వచ్చింది. ఢిల్లీకి మూటలు మోసేవారు, చెప్పులు మోసేవారు ఇయ్యాల ఆ మహానేత విగ్రహాన్ని ఆవిష్కరిస్తే ఆయన ఆత్మ క్షోభిస్తుంది" అని ఎద్దేవా చేశారు. పంచాయతీలకు నిధులు ఎవని అబ్బ సొత్తో, అత్త సొమ్మో కాదని, ఆపడానికి ఎవరూ లేరని హెచ్చరించారు. కేసీఆర్ గారు బయటకు రాగానే కొంతమందికి అజీర్తి అవుతోందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. "కేసీఆర్ పట్ల కొందరు కుక్కల్లా మొరుగుతున్నారు. రాష్ట్రాన్ని సాధించిన నాయకుడిని పట్టుకుని ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారు. ఆయన చనిపోవాలని శాపనార్థాలు పెట్టడం సంస్కారమేనా?" అని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి భాషపై స్పందిస్తూ.. "నీకు ఒక్క భాష మాత్రమే వచ్చు, నాకు మూడు భాషలు వచ్చు. నేను తలుచుకుంటే హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ, గోర్మాటి భాషల్లో కూడా తిట్టగలను. కానీ నీ కుర్చీకి గౌరవం ఇచ్చి ఆగుతున్నాను.



# రాజకీయాలు పక్కన పెట్టండి

- **ప్రజా సేవకే ప్రాధాన్యమివ్వండి**
- **ప్రజల మెప్పు పొందేలా పనిచేసి ఆదర్శంగా నిలవాలి**
- **సర్పంచులకు మంత్రి జూపల్లి కృష్ణారావు దిశానిర్దేశం**

పల్లవి, ఆదిలాబాద్:

నూతనంగా ఎన్నికైన సర్పంచులు రాజకీయాలను పక్కన పెట్టి, ప్రజా సేవనే పరమావధిగా భావించి పని చేయాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు ఎక్సైజ్ శాఖ మంత్రి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. నిర్మల్, ఖానాపూర్, ముధోల్ నియోజకవర్గాలకు చెందిన నూతన సర్పంచుల ఆత్మీయ సమ్మేళనం మరియు సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, సర్పంచులను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు ఎంతో నమ్మకంతో బాధ్యతలు అప్పగించారని, కార్యాలయాలకే పరిమితం కాకుండా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసినప్పుడే ఆదర్శ నాయకులుగా గుర్తింపు లభిస్తుందని మంత్రి పేర్కొన్నారు. గ్రామాల్లో పారదర్శక పాలన అందించడంలో గ్రామ సభలు కీలకమని, ప్రతి గ్రామంలో విధిగా వీటిని నిర్వహించి అభివృద్ధి ప్రణాళికల్లో ప్రజలను భాగస్వాములను చేయాలని మంత్రి ఆదేశించారు. ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ పేద ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తోందని, సంక్షేమ మరియు అభివృద్ధి పథకాలను క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాల్సిన బాధ్యత సర్పంచులదేనని స్పష్టం చేశారు. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, ప్రతి పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దాలని, ప్రభుత్వం గ్రామ పంచాయతీల బలోపేతానికి పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని సర్పంచులకు దిశానిర్దేశం చేశారు. ఇదే క్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇటీవల ముగిసిన పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించిందని మంత్రి జూపల్లి హర్షం వ్యక్తం చేశారు. జిల్లాలోని మొత్తం 1551 స్థానాల్లో కాంగ్రెస్ 820 స్థానాల్లో ఘనవిజయం సాధించి స్పష్టమైన ఆధిక్యతను ప్రదర్శించిందని, బీఆర్ఎస్ 343, బీజేపీ 269, స్వతంత్రులు 110 స్థానాల్లో గెలుపొందారని ఆయన వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీపై ప్రజలు చూపిస్తున్న ఈ ఆదరణకు ప్రతిరూపంగా గ్రామాల అభివృద్ధికి అంకితభావంతో పని చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో పాటు ముఖ్య నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వర్కింగ్ జర్నలిస్టులను విభజించొద్దు

- **డెస్క్ జర్నలిస్టులకు అక్రెడిటేషన్లు ఇవ్వాలి**
- **డెస్క్ జర్నలిస్టు ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ డిమాండ్**
- **హైదరాబాద్ కలెక్టరేట్ ఎదుట భారీ ఎత్తున నిరసన, వినపత్రం అందజేత**

పల్లవి, హైదరాబాద్:



వర్కింగ్ జర్నలిస్టులను అక్రెడిటేషన్లు, మీడియా కార్డుల పేరుతో విభజించొద్దని డెస్క్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ(డీజేఎఫ్‌టీ) రాష్ట్ర అధ్యక్షులు బాదిని ఉపేందర్, ప్రధాన కార్యదర్శి ఎస్‌కే మస్తాన్, కోరారు. డెస్క్ జర్నలిస్టులకు పాత పద్ధతిలోనే అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శనివారం లక్డీకాపూల్‌లోని హైదరాబాద్ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి వివిధ పత్రికలకు చెందిన డెస్క్ జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డెస్క్ జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు తీసేసి, మీడియా కార్డులు ఇవ్వడం సరికాదన్నారు. ఇది జర్నలిస్టుల పట్ల వివక్ష చూపినట్లు అవుతుందని స్పష్టం చేశారు. రిపోర్టర్లు, డెస్క్ జర్నలిస్టులు కలిస్తేనే జర్నలిజం అవుతుందని చెప్పారు. మీడియా కార్డుల పేరుతో డెస్క్ జర్నలిస్టులను రెండో గ్రేడ్ వారిగా మార్చొద్దని చెప్పారు. అలాగే జీవో నంబర్ 252ను సవరించాలని, స్పోర్ట్స్, సినిమా, ఫీచర్స్, వెబ్, కల్చరల్, బిజినెస్, కార్టునిస్టులకు గతంలో లాగా అక్రెడిటేషన్ కార్డులివ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ కదిరవన్ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కేవీ రాజారామ్, డీజేఎఫ్‌టీ కోశాధికారి నిసార్, జాయింట్ సెక్రటరీ విజయ పాల్గొన్నారు. టీడబ్ల్యూజేఎఫ్, హెచ్‌యూజే, ఎస్‌జాట్ మద్దతు డీజేఎఫ్‌టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరసన కార్యక్రమానికి టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవపున్నయ్య, రాష్ట్ర నాయకులు రాజశేఖర్, హెచ్‌యూజే వర్కింగ్ ప్రెసిడెంట్ గండ్ర నవీన్, ప్రధాన కార్యదర్శి జగదీశ్ తదితరులు మద్దతు తెలిపారు. ఎస్‌జాట్ తదితర జర్నలిస్టు సంఘాలు సైతం మద్దతు ప్రకటించాయి.

**ఎవరూ ఆందోళన చెందొద్దు : మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ**

డెస్క్ జర్నలిస్టులకూ గతంలోలాగే అక్రెడిటేషన్ కార్డులు ఇచ్చేలా చూస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు. డెస్క్ జర్నలిస్టుల ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ (డీజేఎఫ్‌టీ) ఖమ్మం జిల్లా కమిటీ సభ్యులు శనివారం మహబూబాబాద్‌లో మంత్రిని కలిసి వినతిపత్రం అందించారు. వారి వెంట టీడబ్ల్యూజేఫ్ నేతలు కూడా ఉన్నారు. ఈ సందర్భంగా వారు డెస్క్ జర్నలిస్టులకు సైతం అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని కోరారు. అలాగే డెస్క్ జర్నలిస్టుల పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వారి వినతులపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ డెస్క్ జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తామని హామీనిచ్చారు. వెంటనే అధికారులతో మాట్లాడతానని వెల్లడించారు. జర్నలిస్టులందరికీ న్యాయం జరిగేలా చూస్తానని హామీనిచ్చారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మంత్రిని కలిసిన వారిలో డెస్క్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ (డీజేఎఫ్‌టీ)కమిటీ కన్వీనర్ కాంకూరి వెంకటేశ్వరరావు, కోకన్వీనర్లు కేతిరెడ్డి అచ్చిరెడ్డి, వంశీ, శాబాదు కరుణాకర్ రెడ్డి జెడ్, టీ డబ్ల్యూ జె ఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఖదీర్, శ్రీనివాస్ రెడ్డి, తదితరులు ఉన్నారు.



# జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్లు ఇవ్వాలి

- **జర్నలిస్టుల మధ్య విభజన వద్దు.. డెస్క్, ఫీల్డ్ రిపోర్టర్ల వివక్షను వీడాలి**
- **టీడబ్ల్యూజేఎఫ్ డిమాండ్**
- **స్పెషల్ కమిషనర్, సీపీఆర్వోలకు వినతిపత్రం అందజేత**

పల్లవి, హైదరాబాద్:

రాష్ట్రంలోని అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఎటువంటి వివక్ష లేకుండా అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ప్రభుత్వాన్ని కోరింది. శనివారం హైదరాబాద్‌లోని సమాచార భవన్‌లో స్పెషల్ కమిషనర్ సిహెచ్. ప్రియాంకను, సచివాలయంలో ముఖ్యమంత్రి సీపీఆర్వో డాక్టర్ గుర్రం మల్సూర్లను ఫెడరేషన్ నాయకులు వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా జీవో 252 అమలు వల్ల తలెత్తిన సమస్యలను వివరించారు. రిపోర్టర్లు, డెస్క్ జర్నలిస్టులు అనే తేడా చూపకుండా అందరికీ కార్డులు ఇవ్వాలని, ప్రస్తుతం ఉన్న కార్డుల సంఖ్యను తగ్గించకుండా యథావిధిగా కొనసాగించాలని వారు విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పెషల్ కమిషనర్ ప్రియాంక స్పందిస్తూ, అక్రిడిటేషన్ల విషయంలో వర్కింగ్ జర్నలిస్టులకు ఎలాంటి నష్టం జరగదని, డెస్క్ జర్నలిస్టులకు కూడా ప్రభుత్వ వసతులు వర్తిస్తాయని హామీ ఇచ్చారు. సీపీఆర్వో డాక్టర్ మల్సూర్ మాట్లాడుతూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డితో చర్చించి జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు పి. రాంచందర్, బి. బసవపున్నయ్య, బి. రాజశేఖర్, గుడిగ రఘు, బి. జగదీష్, గండ్ర నవీన్, హెచ్‌యూజే అధ్యక్షులు బి. అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

# ప్రతి పైసా ప్రజలకే..

(మొదటిపేజీ తరువాయి)



డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం రైతుల కోసం ప్రతి సంవత్సరం 12 వేల 500 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తూ నాణ్యమైన విద్యుత్తు వ్యవసాయానికి ఉచితంగా అందిస్తుందని అన్నారు. 13 వేల 500 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తూ 96 లక్షల పేద కుటుంబాలకు మనిషికి ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని అన్నారు. కోటి మంది మహిళలకు ఇంటింటికి వెళ్లి ఇందిరమ్మ చీరలను ప్రజా ప్రభుత్వం పంపిణీ చేసిందని డిప్యూటీ సీఎం తెలిపారు. గత పాలకులు డబల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరు మీద ప్రజలను మోసం చేస్తే ప్రజా ప్రభుత్వం ఒక అసెంబ్లీ నియోజకవర్గానికి 3500 చొప్పున మొత్తం 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇండ్లు రైతులు పండించిన సన్న వడ్లకు దేశంలో ఎక్కడా లేని విధంగా మద్దతు ధరతో పాటు 500 రూపాయలు క్వింటాల్ కు బోనస్ చెల్లిస్తున్నామని అన్నారు. మహిళల తరపున ఆర్టీసీ సంస్థకు 8 వేల 600 కోట్లు ఖర్చు చేసి ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని అన్నారు. ప్రజా ప్రభుత్వంలో ప్రతి పైసా ప్రజలకే ఖర్చు చేయడం జరుగుతుందని అన్నారు. ప్రజా సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను దిగ్విజయంగా అమలు చేస్తున్న ప్రభుత్వాన్ని ప్రజలు ఎల్లప్పుడూ ఆశీర్వదించాలని డిప్యూటీ సీఎం కోరారు. మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ 2 కోట్ల 25 లక్షల రూపాయలతో అనంత సాగర్ లో నిర్మించిన సబ్ స్టేషన్ ప్రారంభోత్సవం, కోటి 75 లక్షల రూపాయలతో కామంచికల్ లో నిర్మించనున్న సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన ఒకేరోజు చేసుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. గత పాలకులు ధనిక రాష్ట్రం తెలంగాణను స్వలాభం కోసం దోచుకుని ప్రజా ప్రభుత్వం పై 8 లక్షల కోట్ల అప్పుల భారం మోపిందని మంత్రి విమర్శించారు. పేద ప్రజల ముఖాలలో ఆనందం చూడాలని లక్ష్యంతో ఎన్ని కష్టాలు ఉన్న ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందని అన్నారు. పేదలకు సంక్షేమం అమలు చేస్తూనే రోడ్లు, విద్యుత్ సరఫరా, త్రాగునీరు వంటి మౌళిక వసతుల కల్పన అభివృద్ధి పనులు చేపట్టిందని అన్నారు.

**ఎన్.పీ.డి.సి.ఎల్. సీఎండి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర పురోగతి కోసం విద్యుత్ శాఖ తరపున చాలా వేగంగా అభివృద్ధి పనులను పూర్తి చేస్తున్నామని, లోడ్ సమస్యలు ఉన్న ప్రాంతంలో వెంటనే సబ్ స్టేషన్ మంజూరు చేస్తున్నామని, అనంత సాగర్ లో 33/11 కేవీ సబ్ స్టేషన్ ను 4 నెలల కాలంలో పూర్తి చేశామని అన్నారు. పాలేరు నియోజకవర్గం పరిధిలో 8 కోట్ల రూపాయలను ఖర్చు చేసి ఇండ్లపై ఉన్న హై టెన్షన్ వైర్లను సరి చేశామని అన్నారు. వ్యవసాయానికి, గృహ వినియోగదారులకు 24 గంటల పాటు విద్యుత్ సరఫరా చేసేందుకు అవసరమైన లైన్స్ నిర్మాణం ఎప్పటికప్పుడు చేపడుతున్నామని సిఎండి తెలిపారు.**

గత పాలకులు చేసిన మంచి పనులను కొనసాగిస్తూ వాటికి అదనంగా సన్న బియ్యం సరఫరా, నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గురుకులాల్లో పిల్లలకు 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మోటిక్స్ చార్జిల పెంపు చేశామని అన్నారు.

ఆదివారం
28.12.2025
హైదరాబాద్

అక్షర పల్లవి
www.pallavinews.com
follow: pallavinews

# రైతన్నకు సంక్రాంతి భరోసా

## జనవరిలోనే పెట్టుబడి సాయం.. పండుగ కానుకగా యాసంగి నిధులు

- అసెంబ్లీ సమావేశాల సాక్షిగా ప్రకటన వచ్చే అవకాశం
- 9 రోజుల్లోనే నిధుల పంపిణీకి సర్కార్ ప్లాన్
- గత వానాకాలం ఫార్ములానే అమలు చేసే దిశగా ప్రభుత్వం
- నేటి 29 నుంచి అసెంబ్లీ శీతాకాల సమావేశాలు
- సభ ముగిసేలోపు నిధుల పంపిణీపై క్లారిటీ ఇచ్చే ఛాన్స్



పల్లవి, హైదరాబాద్:

తెలంగాణ రైతులకు ఈ సంక్రాంతి మరింత ఉత్సాహాన్నిచ్చేలా కనిపిస్తోంది. యాసంగి సీజన్‌కు సంబంధించి 'రైతు భరోసా' నిధులను సంక్రాంతి కానుకగా అందించేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సచివాలయ వర్గాల ద్వారా అందుతున్న సమాచారం. గత వానాకాలం సీజన్‌లో కేవలం 9 రోజుల్లోనే సుమారు రూ. 9 వేల కోట్ల నిధులను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసిన ప్రభుత్వం, ఇప్పుడు అదే తరహాలో వేగవంతమైన పంపిణీకి కసరత్తు చేస్తోంది. రైతు భరోసా పథకం కోసం బడ్జెట్‌లో కేటాయించిన రూ. 18 వేల కోట్లలో యాసంగి వాటాను విడుదల చేసేందుకు ఆర్థిక శాఖ నుంచి అనుమతులు రానున్నట్లు టాక్ వినిపిస్తోంది.

**అసెంబ్లీ వేదికగా ప్రకటన?..**

డిసెంబర్ 29 నుంచి అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో, సభ ముగిసేలోపు రైతు భరోసా పంపిణీ తేదీపై ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన వెలువడవచ్చని ప్రచారం జరుగుతోంది. జనవరి రెండో వారం నాటికి అన్ని ప్రక్రియలు పూర్తి చేసి, పండుగ సమయంలో రైతుల చేతికి పెట్టుబడి సాయం అందేలా ప్రభుత్వం ప్లాన్ చేస్తోంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందిన వెంటనే చెల్లింపుల ప్రక్రియ ప్రారంభించేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉంది.

**అనర్హులకు చెక్ – సాగు లెక్కల సేకరణ..**

రైతు భరోసా నిధులు కేవలం నిజమైన రైతులకే అందాలనే లక్ష్యంతో వ్యవసాయ శాఖ కసరత్తు చేస్తోంది. సాగు చేయని భూములకు, అనర్హులకు నిధులు వెళ్లకుండా అడ్డుకునేందుకు వ్యవసాయ విస్తరణాధికారులు క్షేత్రస్థాయిలో సాగు లెక్కలను సేకరిస్తున్నారు. క్రాప్ బుకింగ్ పోర్టల్‌లో నమోదైన వివరాల ఆధారంగానే ఈసారి చెల్లింపులు ఉంటాయని సమాచారం. ప్రస్తుతం ఎంత మంది రైతులకు, ఎన్ని ఎకరాలకు నిధులు అవసరమనే అంశంపై అధికారులు తుది జాబితాను సిద్ధం చేస్తున్నారు. ఎకరానికి రూ. 6 వేల పెట్టుబడి సాయం ఏటా ఎకరానికి రూ. 12 వేల పెట్టుబడి సాయం అందించాలన్న హామీలో భాగంగా, యాసంగి విడతగా రూ. 6 వేలను ప్రభుత్వం జమ చేయనుంది. సంక్రాంతి పండుగ ఖర్చులతో పాటు సాగు అవసరాలకు ఈ నిధులు తోడ్పడతాయని రైతులు భావిస్తున్నారు. జనవరిలోనే నిధులు ఖాతాల్లో పడతాయన్న సమాచారంతో అన్నదాతల్లో ఆశలు చిగురిస్తున్నాయి.



## సొంత జిల్లాపై రేవంత్‌ది

# కపట ప్రేమ

- రెండేళ్లలో తట్టెడు మట్టి కూడా తీయలేదు
- హరీష్ రావు నిర్వాకం వల్లే కల్వకుర్తి మోటార్లు ఆగమయ్యాయి
- పొంగులేటికి, మెగా కృష్ణారెడ్డికి వేల కోట్ల అడ్వాన్సులు
- రేవంత్ రెడ్డి ఫోటో పెట్టుకుని మరీ ఇసుక దోపిడీ
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కీలక వ్యాఖ్యలు

పల్లవి, నాగర్‌కర్నూల్:

పాలమూరు తన సొంత జిల్లా అని చెప్పుకునే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గత రెండేళ్లలో పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టు కోసం కనీసం తట్టెడు మట్టి కూడా తీయలేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రంగా విమర్శించారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లాలో పర్యటించిన ఆమె, వట్టెం రిజర్వాయర్ పంప్ హౌస్‌ను సందర్శించిన అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కేవలం "కరప్షన్ అండ్ డైవర్షన్" పాలిటిక్స్ చేస్తోందని ధ్వజమెత్తారు.

**హరీశ్‌రావుపై సంచలన ఆరోపణలు..**

ప్రాజెక్టుల విషయంలో అప్పటి ఇరిగేషన్ మంత్రి హరీశ్‌రావు తీరును కవిత బహిరంగంగానే తప్పుబట్టారు. ఎల్లూరు వద్ద ఓపెన్ పంప్ హౌజ్ కట్టాల్సి ఉండగా, నాటి మంత్రి హరీశ్‌రావు కాంట్రాక్టు సంస్థతో కుమ్మక్కై దానిని అండర్ గ్రౌండ్ పంప్ హౌజ్‌గా మార్చారని ఆరోపించారు. ఆ బ్లాస్టింగ్ కారణంగానే కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో కీలకమైన మూడో, ఐదో మోటార్లు పాడైపోయాయని, నేటికీ అక్కడ మూడు మోటార్లే పని చేస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. సొంత పార్టీ కీలక నేతపైనే కవిత ఇలాంటి ఆరోపణలు చేయడం ఇప్పుడు బీఆర్ఎస్ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

**కాంట్రాక్టర్లకు కోట్లు.. రైతులకు కన్నీళ్లు..**

పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టు పేరుతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం మెగా కృష్ణారెడ్డికి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి వెయ్యి కోట్ల చొప్పున అడ్వాన్స్‌లు ఇచ్చిందని కవిత దుయ్యబట్టారు. నారాయణపేటకొడంగల్ స్కీం కోసం రూ. 1000 కోట్లు కేటాయించినా, కేవలం ల్యాండ్ అక్విజిషన్ తప్ప పనులు ముందుకు సాగడం లేదని విమర్శించారు. వట్టెం రిజర్వాయర్ నల్లమట్టి కోసం తీసుకున్న 900 ఎకరాల భూమిని వెంటనే రైతులకు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**మాఫియా పాలన - అభివృద్ధి శూన్యం..**

దుందుభి నదిలో ముఖ్యమంత్రి ఫోటో పెట్టుకుని మరీ ఇసుక దోచుకుంటున్నారని, ఇసుక మాఫియాపై అధికారులు చర్యలు తీసుకోవాలని కవిత విజ్ఞప్తి చేశారు. నాగర్‌కర్నూల్ మెడికల్ కాలేజీకి భూములిచ్చిన దళితులకు ఇప్పటికీ న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాగర్‌కర్నూల్‌కు రైల్వే లైన్ తీసుకురావడంలో ప్రస్తుత ఎంపీ విఫలమయ్యారని, సామాజిక తెలంగాణ కోసం తెలంగాణ జాగృతి పోరాడుతుందని స్పష్టం చేశారు. అనంతరం ఆమె జిల్లా ఆసుపత్రిని సందర్శించి రోగుల సమస్యలు తెలుసుకున్నారు.

# అకున్ సబర్వాల్ రిపోర్ట్ ఏమైంది?

## డ్రగ్స్ కేసులో బడా బాబులను రక్షిస్తున్నారా?

- నాటి సీఎస్ సోమేశ్ కుమార్‌ను వెంటనే విచారించాలి
- ఈగల్ టీమ్‌లో కొందరు అమ్ముడుపోయారు
- డ్రగ్స్ కేసులో కేంద్ర మంత్రి బండి సంజయ్ షాకింగ్ కామెంట్స్



పల్లవి, హైదరాబాద్:

రాష్ట్రంలో డ్రగ్స్ కేసుల నమోదు కేవలం పండుగలు, న్యూ ఇయర్ వేడుకలకే పరిమితమవుతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. డ్రగ్స్ నిర్మూలనపై కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం ప్రకటనలకే పరిమితమవుతోందని, క్షేత్రస్థాయిలో కఠిన చర్యలు తీసుకోవడంలో విఫలమైందని ఆయన ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అకున్ సబర్వాల్ ఆధ్వర్యంలో జరిగిన విచారణ నివేదికపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉందో సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

**సోమేశ్ కుమార్‌పై విచారణకు డిమాండ్..**

గతంలో అకున్ సబర్వాల్ సేకరించిన కీలక ఆధారాలు, ఆడియో, వీడియో రికార్డులు బయటకు రాకుండా అప్పటి సీఎస్ సోమేశ్ కుమార్ అడ్డుకున్నారని బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ నివేదికలోని స్టేట్‌మెంట్‌లను తదుపరి అధికారులకు గానీ, కోర్టుకు గానీ అందజేయకుండా కేసును నీరుగార్చారని ఆయన ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే సీఎం ఆధ్వర్యంలోని 'ఈగల్ టీమ్' సోమేశ్ కుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారించాలని కోరారు.

**ఈగల్ టీమ్‌పై అనుమానాలు..**

రాష్ట్రంలో డ్రగ్స్ మాఫియాపై పోరాడేందుకు ఏర్పాటు చేసిన ఈగల్ టీమ్‌పై కూడా బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ టీమ్‌లో సమర్థులైన అధికారులు ఉన్నప్పటికీ, ఒకరిద్దరు మాత్రం డ్రగ్ పెడ్లర్లతో చేతులు కలిపి కేసులను పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రం డ్రగ్స్ రహితంగా మారాలంటే అకున్ సబర్వాల్ వంటి కఠినమైన అధికారులకే మళ్ళీ బాధ్యతలు అప్పగించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



## ప్రజాదానాన్ని కొల్లగొడుతున్న

# కార్పొరేట్ విద్యా, వైద్యం

- విద్యాహక్కు చట్టాన్ని ప్రభుత్వం విధిగా అమలు పరచాలి
- చట్ట ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో 25 % సీట్లను పేద పిల్లలకు ఉచితంగా కేటాయించాలి
- దాసు సురేశ్- వ్యవస్థాపక అధ్యక్షులు బీసీ రాజ్యాధికార సమితి

పల్లవి, హైదరాబాద్:

ప్రజాదానాన్ని కార్పొరేట్ విద్యా, వైద్యం కొల్లగొడుతున్నాయని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపకులు దాసు సురేశ్ ఆవేదన వ్యక్తం చేసారు.. బహుజన ప్రజాశక్తి రాష్ట్ర కన్వీనర్ నల్లా లక్ష్మణ్ ఆధ్వర్యంలో తెలంగాణాలో విద్యాహక్కు చట్టం అమలుపరచాలన్న నేపథ్యంలో జరిగిన ధర్నా కార్యక్రమానికి బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్ ముఖ్యఅతిథిగా విచ్చసి, విద్యా హక్కు చట్టం తెలంగాణలో అమలు కాకపోవటం వలన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు .. విద్యా హక్కు చట్టం 2009 చట్ట ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో 25 % సీట్లను పేద పిల్లలకు ఉచితంగా కేటాయించాల్సి ఉండగా ఈ నిబంధనలు కార్పొరేట్ పాఠశాలలు తుంగలో తొక్కుతున్నా అధికారులు చిత్రం చూస్తున్నారని మండిపడ్డారు . విద్యా హక్కు చట్టాన్ని తెలంగాణలో విధిగా అమలు చేయాలని, రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఇందుకు అవసరమైన తీర్మానాన్ని జీవో లేదా ఆర్డినెన్స్ రూపంలో వెల్లడించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో బహుజన ప్రజాశక్తి తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్, నాగర్ కర్నూల్ కార్యకర్తలు, తల్లిదండ్రులు, బిసి రాజ్యాధికార సమితి సీఈఓ సరస్వతి, సీనియర్ సిటిజన్ అధ్యక్షురాలు కొత్తూరి శారద, మొక్కపల్లి లక్ష్మి గారు హాజరవడం జరిగింది.

# ఉద్యమానికి పిలుపు


- దేశ రాజధాని ఢిల్లీలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం
- సీఎం రేవంత్ రెడ్డితో సహా ముఖ్య నేతలు పాల్గొన్నారు
- జనవరి 5 నుండి ఉపాధి హామీ బచావో ఉద్యమానికి పిలుపు

పల్లవి, హైదరాబాద్:

ఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం అత్యంత కీలకమైన నిర్ణయాలకు వేదికైంది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సహా ముఖ్య నేతలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ప్రధానంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం భవిష్యత్తుపై సుదీర్ఘంగా చర్చించారు. కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్వీర్యం చేస్తోందని ఆరోపిస్తూ.. జనవరి 5 నుండి దేశవ్యాప్తంగా 'ఉపాధి హామీ బచావో' ఉద్యమాన్ని ప్రారంభించాలని కాంగ్రెస్ నిర్ణయించినట్లు సీఎం రేవంత్ రెడ్డి ఎక్స్ లో పోస్ట్ చేశారు. గత యూపీఏ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ఆకలిని పారద్రోలడానికి.. ప్రతి పౌరుడికి పని హక్కును కల్పించడానికి ఈ ఉపాధి హామీ పథకాన్ని చట్టబద్ధంగా తీసుకువచ్చింది. అయితే.. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ఈ పథకం పేరును మార్చడం లేదా దాని ప్రాధాన్యతను తగ్గించడం వంటి చర్యలకు పాల్పడుతోందని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీవ్రంగా ఖండించింది. మహాత్మా గాంధీ పేరును ఈ పథకం నుండి తొలగించడం జాతిపితను అవమానించడమేనని రాహుల్ గాంధీ మండిపడ్డారు. కనీసం కేబినెట్‌లో చర్చించకుండా ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. పల్లెల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు పేదల జీవనోపాధికి ఈ పథకం వెన్నెముకగా ఉంది. దీనిని రద్దు చేయడం లేదా నిధులు తగ్గించడం వల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. జనవరి 5 నుండి ప్రారంభం కానున్న ఈ ఆందోళన కార్యక్రమాలను గ్రామ స్థాయి నుండి దేశ రాజధాని వరకు నిర్వహించాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీర్మానించింది.

# చార్జిషీట్‌లోకెక్కిన పుష్పరాజ్!

- సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో బిగ్ ట్విస్ట్
- తొక్కిసలాట కేసులో ఏ-11గా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్
- పుష్ప-2 ప్రీమియర్ షో విషాదంపై ఏడాది తర్వాత కీలక మలుపు
- బన్నీ సహా 23 మందిపై అభియోగాలు మోపిన పోలీసులు
- విచారణకు కోర్టు సమన్లు జారీ చేస్తే టాలీవుడ్ స్టార్ బన్నీ పరిస్థితి ఏంటి?



పల్లవి, హైదరాబాద్:

తెలుగు రాష్ట్రాల్లో పెను సంచలనం సృష్టించిన హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్స్ 'సంధ్య థియేటర్' తొక్కిసలాట కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. సరిగ్గా ఏడాది క్రితం జరిగిన ఈ విషాద ఘటనపై పోలీసులు దర్యాప్తు పూర్తి చేసి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. మొత్తం 23 మందిని నిందితులుగా పేర్కొన్న ఈ చార్జిషీట్‌లో సినీ నటుడు అల్లు అర్జున్‌ను ఏ11 (A11) గా చేర్చడం సినీ, రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. సంధ్య థియేటర్ యాజమాన్యాన్ని ఏ1గా, ముగ్గురు మేనేజర్లు, ఎనిమిది మంది బౌన్సర్లతో పాటు మరికొందరిపై పోలీసులు అభియోగాలు మోపారు.

**ఆ రాత్రి ఏం జరిగింది?**

2024 డిసెంబర్ 4వ తేదీ రాత్రి 9:30 గంటల సమయంలో 'పుష్ప2' బెనిఫిట్ షో కోసం అల్లు అర్జున్ బృందం సంధ్య థియేటర్ వద్దకు చేరుకుంది. తమ అభిమాన హీరోను చూడటానికి వేలాదిగా తరలివచ్చిన అభిమానులు ఒక్కసారిగా ఎగబడటంతో భారీ తొక్కిసలాట జరిగింది. ఈ క్రమంలో రేవతి (35) అనే మహిళ తన కుమారుడు శ్రీతేజ్ (9) తో కలిసి జనం కాళ్ల కింద నలిగిపోయారు. పోలీసులు వారికి ప్రాథమిక చికిత్స అందించి ఆస్పత్రికి తరలించినప్పటికీ, తల్లి రేవతి చికిత్స పొందుతూ మృతి చెందగా, బాలుడు శ్రీతేజ్ ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లాడు.

**ఏడాదిగా పోరాటం.. ఆస్పత్రిలోనే బాలుడు..**

ఘటన జరిగి ఏడాది గడుస్తున్నా, చిన్నారి శ్రీతేజ్ నేటికీ ఆస్పత్రిలోనే మృత్యువుతో పోరాడుతున్నాడు. ప్రస్తుతం రీహాబిలిటేషన్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న బాలుడు నెమ్మదిగా కోలుకుంటున్నాడని వైద్యులు చెబుతున్నారు. అయితే, వైద్య ఖర్చులు పెరగడంతో బాలుడి తండ్రి భాస్కర్ ఇటీవల తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దిల్ రాజును కలిసి అదనపు సహాయం అందించాలని కోరారు. చికిత్స కోసం నెలకు సుమారు రూ. 1.50 లక్షలు ఖర్చవుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

**అల్లు అర్జున్ సహాయం..**

**దిల్ రాజుకు విన్నపం..**

ప్రమాదం జరిగిన సమయంలో అల్లు అర్జున్ మానవత్వంతో బాధిత కుటుంబం కోసం రూ. 2 కోట్లు ఫిక్స్డ్ డిపాజిట్ చేశారు. దానిపై వస్తున్న వడ్డీ డబ్బులతోనే ప్రస్తుతం శ్రీతేజ్‌కు వైద్యం అందిస్తున్నట్లు తండ్రి భాస్కర్ తెలిపారు. అయితే అదనపు ఖర్చుల కోసం రీహాబిలిటేషన్ సెంటర్‌కు అయ్యే వ్యయాన్ని భరించాలని నిర్మాత దిల్ రాజును అభ్యర్థించారు. పోలీసులు దాఖలు చేసిన చార్జిషీట్‌లో నలుగురు ప్రత్యక్ష సాక్షుల వివరాలను కూడా పొందుపరిచారు.

అక్షర పల్లవి






# ప్యారడైజ్ ఫస్ట్‌హాఫ్ ఎప్పుడంటే!

నాచురల్ స్టార్ నాని నుంచి లాస్ట్ టైం వచ్చిన చిత్రం హిట్ 3 తోనే మాస్ లో సాలిడ్ క్రేజ్ ని సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా తర్వాత దానికి మించిన మాస్ తో చేస్తున్న సినిమానే “ది ప్యారడైజ్” . దర్శకుడు శ్రీకాంత్ ఓదెలతో చేస్తున్న సినిమానే ఇది. ఇక ఈ చిత్రానికి అనిరుద్ సంగీతం అందిస్తున్న అనిరుద్ వర్క్ పై కూడా మంచి అంచనాలు ఉన్నాయి. అయితే ఈ సినిమాతో లిస్ట్ లో ఉన్న పెద్ది నుంచి ఆల్రడీ ఫస్ట్ సింగిల్ వచ్చింది. దీనితో ఈ సాంగ్ తర్వాత ప్యారడైజ్ సాంగ్ ఎప్పడని మిగతా ఆడియెన్స్ ఎదురు చూస్తున్నారు. మరి దీనికి మేకర్స్ టైం ఫిక్స్ చేసినట్టు తెలుస్తుంది. దీని ప్రకారం ప్యారడైజ్ నుంచి ఫస్ట్ సింగిల్ జనవరిలో ప్లాన్ చేస్తున్నారట. బహుశా రెండో వారం లేదా మూడో వారంలో వచ్చే ఛాన్స్ ఉన్నట్టు టాక్. మరి దీనిపై మరింత సమాచారం బయటకి రావాల్సి ఉంది.

“This newspaper is published by SAMPATH GANGA from 94, 7TH FLOOR MINERVA COMPLEX, SD ROAD SECUNDERBAD, HYDERABAD, TELANGANA - 500003 on behalf of PALLAVI MEDIA PRIVATE LIMITED, edited by SAMPATH GANGA and printed by LAXMI NARAYANA KARNATI at RATNA GRAPHICS, 2-3-703/7, TIRUMALA NAGAR COLONY, AMBERPET, POLICE LINE, HYDERABAD, TELANGANA - 500013 .” PRGI NO: TGTEL/25/A0679. Email: epaper.pallavinews@gmail.com , Cell: 9010109334.